క్లుప్తంగా

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అడిషనల్ ఎస్‌ఐ రెడ్డి

గంగవరం : ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలని, యువత వ్యవసనాలకు దూరంగా ఉండాలని అడిషినల్ ఎస్ఐ బి.ఆర్.కె.రెడ్డి గిరిజనులను సూచించారు. మండలంలోని పి.పి.పాలెం సమీపంలో గిరిజన రైతులు, యువకులకు ఆన్‌లైన్, లోన్‌యాప్‌లు గురించి, వాహన లైసెన్స్‌లు గురించి అవగాహన కల్పించారు. ఆయన వెంట హెచ్‌సీ రాంబాబు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



పెదకోడాపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్

పెదబయలు: మండలంలోని వనభంగి, పెదకోడాపల్లి, కిముడుపల్లి పంచాయతీ కేంద్రాల్లో జి.మాడుగుల సీఐ రమేష్‌కుమార్ ఆదివారం పర్యటించారు. గ్రామస్తులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకారం అవసరమన్నారు. సారా, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలు వేయాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో యువత మంచి కార్యక్రమాలకు ముందుండాలన్నాలని కోరారు. ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

30న ఎడ్లబళ్ల పోటీలు

మాడుగుల రూరల్: మండలంలో సాగరం పంచాయతీ శివారు వాడపాడులో ఈ నెల 30న సీతారాముల తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎడ్ల బళ్ల పరుగు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎడ్ల బళ్ల పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వాటికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జాలంపల్లిలో ఘనంగా రాములోరి తీర్థం

మాడుగుల: జాలంపల్లిలో రాములోరి తీర్థం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థంలో పంచదార చిలుకలు, నెయిచెక్కీలు హట్‌కేక్‌లా అమ్మకాలు సాగాయి. సాయంత్రం ప్రదర్శించిన నేల వేషాలు, తోడపెద్దు ఉత్సవాలు, రంగులరాట్నాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మత్స్యకొండబాబుకు అభినందనలు

హుకుంపేట: నెహ్రూ యువ కేంద్రం జిల్లా సలహా మండలి సభ్యుడిగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండబాబు నియమితులైయ్యారు. ఆదివారం నెహ్రూ యువ కేంద్రాం కేంద్రా డైరెక్టర్ జనరల్ సతీష్‌కుమార్ మిశ్రా అధికారింగా ఉత్తర్వులు విడుదల చేశారు. మత్స్యకొండబాబుని పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు.

బాలరాజులబాబుకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: అంట్లపాలెం కూడలిలోని బాలరాజులబాబు ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పాపంటపేట, కె.నాయుడుపాలెం, గుర్రంపేట తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

శివారు గ్రామాల్లో అభివృద్ధి బాటలు



నాడు గుర్రాలపై ప్రయాణం



రూడకోట నుంచి జామిగుడ గ్రామానికి తారురోడ్డు



కంచులగుమ్మి- వంచుర్ల రహదారి

- నాడు కాలినడక, గుర్రాలపై ప్రయాణం.. నేడు తారురోడ్లపై రాకపోకలు
- తీరిన దశాబ్దాల నాటి కల
- ఇంజరి, గిన్నెలకోట, జామిగుడ, కుంతుర్ల పంచాయతీలకు రూ.68 కోట్లతో తారురోడ్డు నిర్మాణం
- గిన్నెలకోట,జామిగుడ గెడ్డలకు రూ.4 కోట్లతో రెండు వంతెనలు నిర్మాణం



పెదబయలు: మన్యంలోని ఇంజరి, గిన్నెలకోట, జామిగుడ, భూషిపుట్టు, బరడ, లక్ష్మీపురం పంచాయతీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేవి.. నాడు మావోయిస్టుల అడ్డాగా పేరుగా స్థిరపడ్డాయి..ఆయా పంచాయతీలకు వెళ్లేందుకు నాడు కాలినడకన, గుర్రాలపై **రోజు తరబడి ప్రయాణం** ..ఇదంతా టీడీపీ హయాంలో పెదబయలు మండలంలోని పలు గ్రామాల్లో దుస్థితి.. కనీస రోడ్డు సదుపాయం ఉండేది. కాదు.. ఎక్కడికి వెళ్లాలన్నా ఆ ప్రాంత గిరిజనులకు కాలినడకే శరణ్యంగా ఉండేది. అత్యవసర వాహనాలు అంబులెన్స్ సేవలు అందేవి కావు..సమస్యల పరిష్కారానికి ఆయా గ్రామస్తులు పలుమార్లు టీడీపీ పాలకులు, నాయకులకు వినతులిచ్చినా స్పందించని పరిస్థితి..గత్యంతరం లేక సమస్యలతోనే ఆయా గ్రామస్తులు సహవాసం చేశారు...అదంతా గతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మన్య ప్రాంతంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. **ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పంచాయతీలో నేడు అభివృద్ధి బాటలు దర్శనమిస్తున్నాయి.**

మారుమూల తండాల్లోనూ తారురోడ్లు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి మన్యంలోని మారుమూల తండాల్లో తారురోడ్ల నిర్మాణం జరుగుతున్నాయి. ఇంజరి మండలంలోని గుల్లేలు పంచాయతీ జంగంపుట్టు కొండ్రుం వరకు 17 కిలోమీటర్లు దూరంలో రూ.15.93 కోట్లతో తారురోడ్డు మంజూరైంది. ప్రస్తుతం ఇంజరి పంచాయతీ కంచులగుమ్మి నుంచి వంచుర్ల వరకు మొదటి దఫా తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మొదటి దఫా 10 కిలోమీటర్లు తారురోడ్డు పనులు చేపట్టారు. అలాగే జి.మాడుగుల మండలం బొయితిల పంచాయతీ కేంద్రం నుంచి జక్కం మీదుగా కోడ్రుం వరకు 15 కిలోమీటర్లు రూ.12.45 కోట్లతో తారురోడ్డు పనులు ప్రారంభం కావడంతో ఇంజరి పంచాయతీ గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఇంజరి పంచాయతికే సుమారు రూ.40 కోట్లతో తారురోడ్డు నిర్మాణం జరిగింది. అలాగే పెదబయలు మండలం రూడకోట నుంచి జామిగుడ వరకు రూ.16 కోట్లతో తారురోడ్డును నిర్మించారు. అలాగే జామిగుడ నుంచి ఒడిశా బోర్డర్ వరకు మరో రూ.6 కోట్లతో తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. అలాగే పాడేరు మండలం బంత్రోతు పుట్టు నుంచి గతంలో కాలినడక,గుర్రాలపై ప్రయాణం చేసేవారమని ఇప్పుడు తారురోడ్డు పనులు ప్రారంభం అవ్వడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.పెదబయలు ముంచంగిపుట్టు మారుమూల పంచాయతీలకు గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తే నేడు జగనన్న ప్రభుత్వం తారురోడ్డుగా మార్పు చేసింది. శివారు గ్రామాలకు రహదారులతో రవాణా సదుపాయం అందుబాటులో వచ్చింది. ఆయా ప్రాంత గిరిజనులు ఎన్నడూ ఊహించని విధంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా అందుబాటులో రావడంతో సర్వత్రా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వంతెనల పనులు ప్రారంభం

మండలంలోని గిన్నెలకోట గెడ్డకు ప్రభుత్వం రూ.2 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గత ఏడాది వర్షాకాలంలో వరద ఉధృతి వల్ల పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జామిగుడ గ్రామ సమీపంలో గెడ్డకు మరో రూ.2 కోట్లతో వంతెన పనులు ప్రారంభించారు.ఈ రెండు వంతెనలు నిర్మాణం పూర్తయితే మూడు పంచాయతీల నుంచి 65 గ్రామాలకు వర్షాకాలంలో గెడ్డల కష్టాలు శాశ్వత పరిష్కారం కలుగుతుందని పలువురు చెబుతున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



ఇంజరి పంచాయతీకి తారురోడ్డు వస్తుందని అనుకోలేదు. జగనన్న ప్రభుత్వం కృషితో శివారు గ్రామాలకి తారురోడ్డు పనులు ప్రారంభమైంది. శరవేగంగా రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇప్పుడే మాకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు ఉంది.గతంలో గుర్రాలపై, కాలినడకనే సాగించే వారము. 108, అంబులెన్స్ వాహనాలు రాకపోవగంతో రోగులకు ఆస్పత్రి తీసుకెళ్లేందుకు డోలీ మోతలే తప్పేవి కావు. సకాంలో చికిత్స అందక పలువురు మార్గమధ్యంలో మృతి చెందిన సంఘటనలు గత ప్రభుత్వంలో ఉండేవి. నేడు మారుమూల గ్రామాలకు సైతం 108. 104 వాహనం సదుపాయం కలిగింది సకాలంలో ఆస్పత్రికి చేరగలుగుతున్నాం. జగనన్న ప్రభుత్వానికి మేము రుణపడి ఉంటాము.

– **బి.నాగేశ్వరరావు**, మాజీ ఎంపీటీసీ, ఇంజరి గ్రామం

ఏళ్లనాటి కల సాకారం



మారుమూల గ్రామాల ప్రజలకు ఈ ప్రభుత్వంలోనే పెద్ద ఎత్తున తారురోడ్లు నిర్మాణం జరిగింది. మండలంలో ఎక్కువ గ్రామాలు, ఎక్కువ జనాభా కలిగిన ఇంజరి పంచాయతీలో గతంలో ఒక్క గ్రామానికి కూడా రోడ్డు సదుపాయం లేదు. నేడు సుమారు రూ. 40 కోట్లతో సుమారు 30 కిలో మీటర్లు రింగు రోడ్డు నిర్మాణం జరుగుతుంది.శరవేగంగా పనులు జరుగుతున్నాయి. శివారు ప్రాంతాల్లోని రోడ్లు, ఇతరత్రా అభివృద్ధి పనులకు జగనన్న ప్రభుత్వం కోట్లాది రూపాయలను మంజూరు చేస్తోంది. ప్రస్తుతం గ్రామాల్లో రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏళ్ల నాటి రహదారి కల సాకారం కావడంతో ఆనందంగా ఉంది.

– **పాంగి సత్యవతి**, ఎంపీటీసీ సభ్యురాలు, ఇంజరి సెగ్మెంట్, పెదబయలు మండలం

ప్రగతిలో పథంలో గ్రామాలు



ఒక్క ఇంజరి పంచాయతీలో రెండు తారురోడ్లు రూ.39 కోట్లతో పనులు పూర్తయ్యాయి. మండలంలో మారుమూల ఇంజరి,గిన్నెలకోట, జామిగుడ,కుంతుర్ల పంచాయతీలకు నాలుగు తారురోడ్లు సుమారు. రూ.68 కోట్లలో రోడ్డు నిర్మాణం జరిగింది. అలాగే గిన్నెలకోట, జామిగుడ గెడ్డలకు రూ.4 కోట్లతో వంతెనలు పనులు ప్రారంభమయ్యాయి. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. దీంతో ప్రగతి పథంలో గ్రామాలు దర్శనమిస్తున్నాయి.

– **ఎం.శంకరరావు**,ఏఈ, పంచాయతీ రాజ్ ప్రాజెక్టు,పాడేరు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

సాక్షి, పాడేరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తు స్వీకరిస్తున్నట్టు సీడీపీవో ఝాన్సీరాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.కాడెలి పంచాయతీ గురుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త, పాడేరు పంచాయతీలోని మోదకొండమ్మవీధిలో అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టు ఖాళీగా ఉందని, అర్హులైన స్థానిక వివాహిత మహిళలతో భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, స్థానిక నివాసం ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు పాడేరు సీడీపీవో కార్యాలయంలో వివరాలు తెలుసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఫిబ్రవరి 10వ తేదీ లోగా సాయంత్రం ఐదు గంటల లోగా తమ కార్యాలయానికి నేరుగా గాని, పోస్టల్ ద్వారా గాని అందజేయాలని సూచించారు. గడువు తరువాత వచ్చే దరఖాస్తులు పరిశీలించమని తెలిపారు.

ఎటపాక: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి శనివారం తెలిపారు.మండలంలో మొత్తం నాలుగు పోస్టుల్లో ఆయా(సహాయకురాలు) గన్నవరం-1, ఎన్‌టిఆర్ కాలనీ, కాపుగొంపల్లి, జగ్గవరం మిని అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన గిరిజనులు ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

రాజవొమ్మంగి: స్త్రీశిశు సంక్షేమ శాఖ రాజవొమ్మంగి ప్రాజెక్టు పరిధిలోని బడదనాంపల్లి కేంద్రంలో ఖాళీగా దున్న అంగన్‌వాడీ సహాయకురాలు (ఆయా) పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో దేవమణి కోరారు. ఇందుకు అవసరమైన అప్లికేషన్ ఫారాలు ఫిబ్రవరి 10వ తేదీ వరకు తమ కార్యాలయంలో పొందవచ్చని ఆమె తెలిపారు. అభ్యర్థి ఎస్టీ అయి వివాహిత అయి ఉండాలని, విద్యార్హత 10వ తరగతి. 2023 జూలై ఒకటవ తేదీ నాటికి వయస్సు 21 సంవత్సరాలు నిండి, 35 సంవత్సరాల లోపు ఉండాలని. అభ్యర్థి స్థానికంగా నివాసం ఉండాలని సూచించారు. విద్యార్హత, కుల ధ్రువీకరణ తదితర సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారిచే అటిస్టేషన్ చేయించిన దరఖాస్తులను ఫిబ్రవరి 10వ తేదీ లోగా స్థానిక సీడీపీవో ప్రాజెక్టు కార్యాలయం అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని సీడీపీఓ దేవమణి అన్నారు.

వై.రామవరం: మండలంలోని దారగడ్డ పంచాయతీ పూలోవ గ్రామంలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ పోస్టుకు దరకాస్తు చేసుకోవాలని మారేడిమిల్లి ఐసీడీఎస్ సీడీపీవో వి.ఎస్.ప్రసన్న ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అభ్యర్థి 10వ తరగతి పాస్ అయ్యి ఉండాలన్నారు. 2023 జులై 1వ తేదీనాటికి 21 నుంచి 30 ఏళ్ల లోపు ఉండాలని, ఎస్టీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాల జిరాక్సులను గెజిటెడ్ అధికారితో అటెస్టిషన్ చేయించి దరఖాస్తుకు జతపరచాలన్నారు. ఫిబ్రవరి 10వ తేదీలోగా దరఖాస్తులను మారేడిమిల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు మారేడిమిల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుగువైపుల నుంచి పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరైయ్యారు. ఈ సమ్మేళనానికి కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పింజర్ల వీరభద్రరావు కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలన్నారు. పూర్వ విద్యార్థి బి.రత్న శేఖర్ (వైజాగ్ పోర్ట్ ట్రస్టు ట్రాఫిక్ మేనేజర్) కళాశాలకు గతంలో ఆర్వో, పార్కింగ్ షెడ్డు నిర్మాణానికి సహకరించారు. కళాశాల మైదానాన్ని శుభ్రం చేయించి, రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు తన వంతు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకొరికొకరు క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. అల్యూమినీయ అసోసియేషన్ కన్వీనర్ రవికుమార్, అధ్యాపకులు వెంకటేష్ పాల్గొన్నారు.

రోగులకు పరామర్శ



రోగులను పరామర్శిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : జిల్లా ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న గిరిజన రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిని ఆయన ఆదివారం సందర్శించారు. శనివారం జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యం పొందుతున్న జి.మాడుగుల మండలం బొయితిలి గ్రామానికి చెందిన లసంగి శివజ్యోతితో పాటు ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న ఇతర రోగులను పరామర్శించి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్య చికిత్సలు పొందుతున్న రోగులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆయన నిర్వాహకులను కోరారు.

ఘనంగా శ్రీరాముల తీర్థం



చిట్టిబోయిన పాలెంలో తీర్థ సందడి

అచ్యుతాపురం : మండలంలోని చిట్టిబోయినపాలెంలో ఆదివారం రాత్రి శ్రీరాముల వారి తీర్థం ఘనంగా జరిగింది. గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా చిటికలు, భజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

ఘనంగా నల్లమారమ్మ తల్లి పండగ



పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక : పాటిపల్లి పంచాయతీ నల్లమారమ్మ తల్లి అమ్మవారి పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారికి గుర్తింపు ఉండడంతో పలు ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వచ్చారు.

ముగిసిన గౌరీ పరమేశ్వరుల మహోత్సవం



బాణసంచా మెరుపులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం తెల్లవారు జామున ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అత్యంత వైభవంగా కనీవిని ఎరుగని రీతిలో ఈ ఏడాది మహోత్సవానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు కుటుంబ సమేతంగా వేడుకలు తిలకించారు.

నేలవేషాలు, స్టేజ్ ప్రోగ్రాంలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలు స్వచ్ఛంద సంస్థలు అమ్మవారి ప్రసాద వితరణ, మజ్జిగ, తాగునీటి సౌకర్యం కల్పించాయి. మందు గుండు సీతారామయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బాణసంచాను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు ప్రారంభించారు. మహోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ జి.శంకరావు భారీ బందోస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహాలక్ష్మీనాయుడు, నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో గడప గడపకు

అడ్డతీగల: మండలంలోని ధాన్యంపాలెం గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో భాగంగా రావులపాడులో ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. పెనికెలపాడులో 11.30 గంటలకు ,చాపరాతిపాలెంలో 12.30 గంటలకు , ధాన్యంపాలెంలో 2.30 గంటలకు , తియ్యమామిడిలో 3.30 గంటలకు, జల్లూరు గ్రామంలో 4.30 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొవాలన్నారు.

వలంటీర్లకు అండగా ప్రభుత్వం

చింతపల్లిరూరల్: మండలంలో తమ్మంగుల పంచాయతీ గ్రామ వలంటీర్ రీమల కొండబాబు తల్లి రాజులమ్మ మృతి చెందారు.విషయం తెలుసుకున్న పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదివారం దహన సంస్కరాల్లో పాల్గొని నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోని, అండగా ఉంటుందన్నారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య ,సర్పంచ్‌లు సలిమితి లక్ష్మయ్య,బొండా సింహాచలం, నాయకులు కృష్ణారావు, చిన్నాబ్బాయి, బంగారయ్య, శోభకృష్ణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన నేడు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ప్రివెంట్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కల్పిస్తున్నట్టు సీఐ జి.వి.వి. సత్యనారాయణ (సీఐడీ విభాగం రాజమహేంద్రవరం) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. సభా ప్రాంగణం వద్దకు సోమవారం ఉదయం 8 గంటలకే చేరుకోవాలని కోరారు.

ఫిబ్రవరి 16న రథసప్తమి వేడుకలు

అనకాపల్లి : మండలంలో రాజుపాలెం శ్రీ సూర్యనారాయణమూర్తి రథసప్తమి వేడుకలు ఫిబ్రవరి 16న నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు కొణతాల బాబూరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 14 ఉదయం 7 గంటలకు సూర్యనారాయణమూర్తి కల్యాణం, మధ్యాహ్నం 3 గంటలకు సారె ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో జాతీయ రహదారి నుంచి రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవస్థానం వరకూ రూ.1.50 కోట్లతో కొత్త రోడ్డు వేసినట్లు తెలిపారు.